


123

ధారావాహిక

# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి ...
99893 71284

**జరిగిన కథ :** నందనరాయని చెరసాలలో మురారిదేవుడు బందీగా ఉన్నాడంటూ జాయచోడునికి లేఖ పంపాడు చక్రవర్తి. ఆ లేఖను చదివి దిగ్భ్రమ చెందాడు జాయచోడుడు. వెంటనే కదిలాడు. ధనదుప్రోలులో సైనిక పటాలాన్ని సిద్ధం చేయించి.. పొలిమేరల్లోనే ఉంచాడు. పెద్దసేనతో దండెత్తి వస్తాడని ఊహించిన నందనరాయడు.. జాయచోడుడు ఒంటరిగానే రాజధానిలో ప్రవేశించడంతో ఆశ్చర్యపోయాడు. పూర్ణకుంభ స్వాగతంతో ఆహ్వానించి.. ఆయనతో సమావేశమయ్యాడు.

''ఆ నీచుడు తమరి మేనల్లుడు అయినందుకు మేము ఆశ్చర్యపోతున్నాం జాయచోడ దేవా!'' అన్నాడు రాయడు.

''క్షమించాలి నందనరాయా! మురారిదేవుని తప్పు ఏమిటో మీరు చెప్పలేదు. మహామండలేశ్వరులు శ్రీ గణపతిదేవుల సంతానం మురారిదేవుడు. అనుభవం కోసం చక్రవర్తి పాకనాడు రాజ్యానికి పాలకుడుగా నియమించారు. మురారి అక్కడ చేస్తోన్న పరిపాలన ఏమిటో.. మీపట్ల అనుచిత ప్రవర్తన ఏమిటో.. ఎందుకు మీరు కారాగారంలో బంధించారో నాకు తెలియదు. చెబితే మురారిపై తగినశిక్ష మహామండలేశ్వరులే నిర్ణయిస్తారు కదా..''

''మా ఇంటి ఆడపడచును అపహరించాడు. తనను వివాహం చేసుకోవాలని బలవంతపెడితే మేమే వెళ్లి ఆమెను విడిపించి అతణ్ని బంధించి తెచ్చాం. ఇప్పుడు చెప్పండి. అతనికి తమరైతే ఏ శిక్ష విధిస్తారు?'' అన్నాడు.

నిర్ఘాంతపోయాడు జాయచోడుడు.

ఏదో కుటుంబ కలహాలు, అక్కా తమ్ముళ్ల మధ్య అంతఃకలహాలుగా ఉన్న మురారి వ్యవహారం ఇప్పుడు బహిరంగమై అతడొక కొరకరాని కొయ్యగా నిరూపితం అవుతున్నాడు. జాయచోడుడు ఏమీ చెప్పలేకపోయాడు.

''మీ ప్రజ్ఞాపాటవాలు సామ్రాజ్యమంతా తెలుసు. మీరు గతంలో ఇక్కడ మతంపై నిర్వహించిన కళాయుద్ధంలో నేనూ పాల్గొన్నాను. నన్ను మన్నించి ఈ సమస్యను మీరే పరిష్కరించండి..'' అన్నాడు రాయడు.

''మనం యుద్ధభూమిలో లేము. ఇది పండిత సభ. నన్ను చూడటానికి ఇందరు కవిపండితులు ఇక్కడకు వచ్చారు. ఆ శిక్ష ఏమిటో ఈ సభ నిర్ణయిస్తే శిరసావహించడానికి సిద్ధంగా ఉన్నాను..'' చెప్పాడు జాయచోడుడు.

సభలో చర్చలు మొదలయ్యాయి. ఆలోచించి ఆలోచించి ఆస్థాన పండితుడు ఉరువేలశర్మ లేచాడు.

''మహానాట్యకారులు మీరు. మురారిచేసిన తప్పుతో.. నిజానికి పెద్ద యుద్ధం జరిగి అటూఇటూ పెద్ద ప్రాణనష్టం జరిగేది. తమరు దానిని తప్పించి శిక్షకు సిద్ధమయ్యారు. అతను చేసిన తప్పునకు కనీసం ఆరునెలలు కారాగార శిక్ష ఉండాలని, మరోసారి ఆ తప్పు చేయనని అతడు అగ్నిపట్టి ప్రమాణం చెయ్యాలని మా తీర్పు..''

అందరి కరతాళ ధ్వనులతో సభ దీనిని ఆమోదించింది.

అప్పుడన్నాడు నందనరాయడు.

''మాది ఓ కోరిక. మీరు మా నాట్యమండపంలో నాట్యం చెయ్యాలి. అపర నటరాజైన తమరి ప్రదర్శన కోసం, మేము చాలా కుతూహలంగా ఉన్నాం..''

''మేనల్లుణ్ని విడిపించుకోవాలని వచ్చినవాణ్ని. నన్ను సన్మానంతో జయించారు నందనరాయడు. సభల్లో.. ముఖ్యంగా పండితసభల్లో మాట్లాడగల ప్రజ్ఞ నాకు లేదు. అందువల్ల భర్తృహరి సుభాషితం ఒకటి చెబుతాను.

**మూర్ఖోపి శోభతే తావత్సభాయాం వస్త్రవేష్టితః**
**తావచ్ఛ శోభతే మూర్ఖో యావత్కించన్నభాషతే..**

(చక్కగా అలంకరించుకుని మాట్లాడకుండా కూర్చున్న నాబోటి వాడిని పండితులుగా భ్రమపడతారు. అది మాట్లాడనంత సేపే. మాట్లాడితే వాడి బండారం బయటపడి పోతుంది)

జాయచోడుడు వినమ్రతతో సందర్భానుసారంగా పద్యం చెప్పినప్పుడు కరతాళధ్వనులతో సభ మారుమోగిపోయింది.

''నాకొక అభ్యంతరం. నేను రాజాస్థాన నాట్యమండపాలలో నాట్యం చేసే వయస్సు దాటిపోయాను. దేవాలయాల నృత్యమండపాలలో మాత్రమే నర్తిస్తాను''

రాజధానిలోని చెన్నకేశవ దేవాలయంలో జాయచోడుని నాట్య ప్రదర్శన ఏర్పాటయింది.

''మీకోసం ఓ కొత్త నాట్యం చేస్తాను. ఇది నటరాజ నృత్తం. దయచేసి మీరాజ్యంలోని ఓ నాట్యబృందాన్ని పిలిపించండి. నాట్యమండపమంతా పసుపు, కుంకుమ, ముగ్గుసున్నం కలిపి మిశ్రమం నిండుగా పోయించండి..'' అన్నాడు.

ఆయన సూచనలపై మండపమంతా మిశ్రమం నిండుగా పోశారు. నాట్యబృందంలోని నట్టువాంగ గాయకులకు, వాద్యకారులకు ప్రత్యేక సూచనలు చేసి నటరాజ